

మేడ్చల్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): వచ్చేది మన ప్రభుత్వమేనని, ధైరంగా ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు బీఆర్ఎస్ నేతలకు సూచించారు. మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట్, మూడుచింతలపల్లి బీఆర్ఎస్ నేతలు, మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి గురువారం హరీశ్‌రావును కలిశారు. ఇటీవల కొందరు శామీర్‌పేట్ సొసైటీలోని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఫొటోలను చించివేసిన క్రమంలో హరీశ్‌రావును కలిసినట్లు మధుకర్‌రెడ్డి తెలిపారు.


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I హైదరాబాద్, శుక్రవారం 11 ఏప్రిల్ 2025 HYDERABAD




మహావీర్ జయంతి సందర్భంగా జైన్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ తాడ్‌బండ్ నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

# వర్సిటీ భూములను రక్షించండి

## కంచ గచ్చిబౌలి భూములు జీవవైవిధ్యానికి నిలయం

### వృక్షసంపద, వన్యప్రాణులకు ఆవాసం

### భూములను లాక్కుంటున్న ప్రభుత్వం

అటవీ శాఖ నిబంధనలు పాటించని సర్కార్

సాధికార కమిటీకి తెలిపిన వర్సిటీ విద్యార్థులు

ఎంసీహెచ్‌ఆర్‌డీలో కమిటీతో సమావేశమైన విద్యార్థి సంఘాలు




సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): అందరిది ఒకటే గొంతు.. పర్యావరణ పరిరక్షణకు అందరిది ఒకే బాట.. విషయం ఏదైనా ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని బట్టబయలు చేయడమే తమ లక్ష్యం అన్నట్లుగా అరుదైన జీవవైవిధ్యం నిండిన హెచ్‌సీయూ భూముల పరిరక్షణకు ఒకటిగా గళం విప్పారు. పర్యావరణంపై ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని కేంద్ర కమిటీ కళ్ల ముందర నిలిపారు. కంచ గచ్చిబౌలి భూములపై కన్నేసిన కాంగ్రెస్ సర్కారు.. పర్యావరణంపై చేసిన దారుణాలను నివేదికలతో సహా వివరించారు. క్షేత్రస్థాయిలో పర్యటించిన కమిటీ సభ్యులను విద్యార్థులు కలవకుండా పోలీసులు అడ్డుకున్నా.. జూబ్లీహిల్స్ ఎంసీహెచ్‌ఆర్‌డీలో విద్యార్థులు, వర్సిటీ జేఏసీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ క్రమంలోనే భూముల కోసం ప్రభుత్వం చేసిన ఆకృత్యాలను నివేదిక రూపంలో పేర్కొన్నారు. విద్యార్థులతో దాదాపు గంటపాటు జరిగిన సమావేశంలో అరుదైన జీవావరణం విస్తరించిన కంచ గచ్చిబౌలి భూముల గురించి కమిటీ సభ్యులకు వివరించారు. యూనివర్సిటీ అధ్యాపక, విద్యార్థి సంఘం నుంచి ఐదుగురు సభ్యులు, మరో విద్యార్థి సంఘం నుంచి ఐదుగురు సభ్యులు కమిటీ సభ్యులను కలిశారు. సమావేశంలో వర్సిటీ భూముల విషయంలో జరిగిన విధ్వంసాన్ని, అటవీ సంపదను నిర్వీర్యం చేసే క్రమంలో ప్రభుత్వం అతిక్రమించిన చట్టాలు, వన్యప్రాణులతో చెలగాటం ఆడిన తీరును వివరించారు. అరుదైన వృక్ష సంపద కలిసిన భూములను రియల్ ఎస్టేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కాంగ్రెస్ సర్కారు చేసిన కుట్రలను ముందరపెట్టారు. పర్యావరణ పరిరక్షణ విషయంలోనూ ప్రభుత్వం దృష్టి పెట్టలేదని, ఎంత సేపు జీవవైవిధ్యానికి నిలయమైన యూనివర్సిటీని చెరబట్టేందుకే ప్రభుత్వం యోచిస్తుందని, ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవడంతో వాస్తవాలను కోర్టుకు అందజేసి వర్సిటీ భూములలో కొలువై ఉన్న జీవవైవిధ్యాన్ని పరిరక్షించాలని విద్యార్థులు కోరారు.

#### అక్రమ కేసులపై కమిటీ దృష్టికి..

ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర సాధికారిక కమిటీ బృందం ఒంటరిగానే యూనివర్సిటీలో పర్యటించింది. ఉదయం 10.30గంటలకు వర్సిటీ ప్రాంగణానికి చేరుకుని, చెట్లను నరికివేసిన ప్రాంతానికి వెనుక నుంచి చేరుకునేలా ప్రభుత్వం, పోలీసులు ఏర్పాట్లు చేశారు. అక్కడ గంట సేపు జరిపిన పరిశీలన తర్వాత.. నేరుగా జూబ్లీహిల్స్‌లోని ఎంసీహెచ్‌ఆర్‌డీ క్యాంపస్‌లో విద్యార్థి సంఘాలు, వర్సిటీ జేఏసీతో భేటీ అయ్యారు. దాదాపు గంటపాటు సాగిన ఈ సమావేశంలో ప్రభుత్వం హెచ్‌సీయూ భూముల విషయంలో ఎలా వ్యవహరించిందనే అంశాన్ని కమిటీ ముందర ఉంచారు. పరిశోధన విద్యార్థులు, విద్యార్థి సంఘాలు తయారు చేసిన ప్రత్యేక నివేదికలను కమిటీకి అందజేశారు. వర్సిటీ భూముల ఆక్రమణతో జీవం కోల్పోయిన వన్యప్రాణులు, వనసంపద విధ్వంసంతో దెబ్బతింటున్న జీవావరణం, పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్యమించిన విద్యార్థులు, జేఏసీ సభ్యులపై పోలీసుల దౌర్జన్యం, అక్రమ కేసులతో విద్యార్థులపై జరిగిన వేధింపులను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. కేవలం భూముల కోసం అరుదైన వృక్షజాతులు, గుట్టలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాన్ని నిలవరించేలా చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులను కోరారు. వర్సిటీ జేఏసీ, స్టూడెంట్ యూనియన్ నుంచి ఐదురుగు, ఏబీవీపీ నుంచి మరో ఐదుగురితో కూడిన రెండు బృందాలు కూడా గంటపాటు చర్చించాయి. ఈ క్రమంలో కమిటీ లేవనెత్తిన పలు అంశాలకు వివరించిన విద్యార్థులు.. ప్రభుత్వం చేసిన విధ్వంసం పర్యావరణానికి పెనుప్రమాదంగా మారిందని, దీంతో ఎంతో జీవవైవిధ్యం దెబ్బతిన్నట్లుగా పేర్కొన్నారు.

#### తప్పుదోవలకు చెక్ పెట్టేలా..

విద్యార్థుల ఆందోళనలు, పర్యావరణ పరిరక్షణ కోసం చేస్తున్న ఉద్యమాన్ని నీరుగార్చేలా ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు, ఆ భూముల్లో అటవీ సంపద లేదని, వన్యప్రాణులే ఉండవని చెబుతూ ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తున్న తీరును సాక్ష్యాధారాలతో సహా కమిటీకి అందజేశారు. గడిచిన 20 రోజుల కాలంగా వర్సిటీ భూముల్లో ఆవాసం కోల్పోయిన, మృత్యువాత పడిన జంతువుల చిత్రాలు, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ అంటూ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ఆరోపణలకు చెక్ పెట్టే విధంగా రూపొందించిన సమగ్రమైన సమాచారాన్ని నివేదిక రూపంలో అందజేశారు. అటవీ భూములే కాదంటూ కాంగ్రెస్ చేస్తున్న వాదనలకు కొట్టిపారేస్తూ.. అటవీ భూముల నిర్ధారణకు అమలులో ఉన్న చట్టపరమైన, శాస్త్రీయ విధానాలతో చేసిన అధ్యయనాలను కూడా అందజేస్తామని కమిటీకి సూచించారు. ఈ క్రమంలో మరో దఫా జరిగే సమావేశంలో మరింత సమాచారం కూడా సేకరించి నివేదిక రూపంలో అందజేస్తామని విద్యార్థులు స్పష్టం చేశారు.

#### కాంగ్రెస్ విధ్వంసాన్ని వివరించాం

400 ఎకరాల విస్తీర్ణంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన విధ్వంసాన్ని సెంట్రల్ కమిటీ ముందుకు తీసుకెళ్లాం. మార్చి 30 తర్వాత క్యాంపస్ ప్రాంగణంలో పర్యావరణం, వన్యప్రాణులపై చేసిన ఆక్రమణల తీరును కమిటీకి వివరించాం. అత్యున్నత న్యాయస్థానం నియమించిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీని గౌరవిస్తూ.. క్షేత్రస్థాయిలో, వర్సిటీ ప్రాంగణంలో ఒకసారి కమిటీ సభ్యులు విద్యార్థులతో కలవాల్సిన అవసరం ఉంది, అనుమతించాలని కోరాం. విద్యార్థులు, జేఏసీతో మూకుమ్మడిగా వర్సిటీలో పర్యటించే విధంగా ఏర్పాట్లు చేయాలని కోరాం. కేవలం భూముల లాక్కునేందుకు కాంగ్రెస్ సర్కారు చేస్తున్న కుట్రలను, విద్యార్థులపై పోలీసులు చేసిన దాడులను తమ విద్యార్థి సంఘం తరుపున నివేదిక రూపంలో అందజేశాం.

**- బాలకృష్ణ, ఏబీవీపీ సెంట్రల్ కమిటీ**

#### 49 పేజీల నివేదిక అందజేశాం..

సెంట్రల్ యూనివర్సిటీ భూములపై ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని 49 పేజీలతో రూపొందించిన నివేదికను సెంట్రల్ సాధికార కమిటీకి అందజేశాం. కమిటీ సభ్యులందరికీ అర్థమయ్యే విధంగా రూపొందించిన శాస్త్రీయ ఆధారాలు, జియోలొకేషన్, తేదీ, సమయంతో కూడిన వీడియోలు, ఫొటోలతో పర్యావరణంపై జరిగిన దాడిని వివరించాం. ఎంతో వృక్షసంపద, వన్యప్రాణులు జీవం కోల్పోతే ప్రభుత్వం మాత్రం ఏఐ ఆధారిత వీడియోలు, ఫొటోల పేరిట తప్పుదోవ పట్టిస్తోంది. యూనివర్సిటీలో విద్యార్థులను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. వీటన్నింటిని ప్రత్యేక నివేదిక రూపంలో అందజేయడంతో కమిటీ సభ్యుల నుంచి సానుకూలమైన స్పందన వచ్చింది. అయితే సుప్రీంకోర్టుకు ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి కార్యాచరణ ఉంటుంది. మరోసారి కూడా విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు కూడా తెలిపారు. **- ఉమేశ్, హెచ్‌సీయూ స్టూడెంట్ యూనియన్, ప్రెసిడెంట్**



# రోడ్ల నిర్వహణలో బెడిసికొట్టిన వ్యూహం!

పాత పద్ధతిలోనే సీఆర్ఎంపీ పనులు

ఏజెన్సీలను పక్కన పెట్టిన అధికారులు

ప్రైవేట్‌కు అప్పగించేందుకు ప్రతిపాదనలు

సర్కార్ నిర్ణయం కోసం బల్దియా ఎదురుచూపులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇతర మెట్రో నగరాలకు ఆదర్శవంతంగా నిలిచిన సీఆర్ఎంపీ పథకాన్ని తిరిగి పునః ప్రారంభించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. కేసీఆర్ పథకాలను ఆనవాళ్లు లేకుండా చేస్తామన్న రేవంత్ సర్కార్‌కు క్షేత్రస్థాయిలో అసాధ్యం కాదని తేలిపోయింది. ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ పథకాల స్థానంలో హెచ్ సిటీ ప్రాజెక్టును తెరపైకి తీసుకువచ్చి.. పాత ప్రతిపాదనలనే పట్టాలెక్కిస్తున్నది. తాజాగా సీఆర్ఎంపీ పథకాన్ని తిరిగి కొనసాగించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు సీఆర్ఎంపీ కింద రోడ్ల నిర్వహణ బాధ్యతలు ప్రైవేట్ ఏజెన్సీలకు ఇచ్చేందుకుగానూ ప్రభుత్వ అనుమతి కోరుతూ జీహెచ్ఎంసీ ప్రతిపాదనలు సమర్పించింది. ఐతే సీఆర్ఎంపీ మొదటి విడుతతో పాటు రెండో విడుత పథకానికి మళ్లీ టెండర్లు పిలిచి కొత్త ఏజెన్సీలకు అప్పగించడమా? లేక పాత ఏజెన్సీలకు ఇవ్వడమా అని రెండు ప్రతిపాదనలు ప్రభుత్వానికి (మిగతా IIవ పేజీలో)

# సున్నాలేసి రిబ్బన్ కటింగ్‌లు చేశారు

ఒక్క ఫ్లై ఓవర్ పూర్తి చేయలే..

ఎక్స్‌లో కేటీఆర్ ధ్వజం



సిటీబ్యూరో:బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాయువేగంతో చేపట్టిన ఎస్ఆర్‌డీపీ పనులపై కాంగ్రెస్ గాలికి వదిలేసిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. 16 నెలల కాంగ్రెస్ పాలనలో పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేసిన వాటికి సున్నాలేసి రిబ్బన్ కటింగ్‌లు చేశారే తప్ప నిర్మాణంలో ఉన్న వంతెనలు, ఆర్వోబీ, ఆర్‌యూబీల పురోగతిని సమీక్షించలేదని ఎక్స్ వేదికగా కేటీఆర్ విమర్శించారు. ఫలక్‌నుమా ఆర్వోబీని పట్టించుకునే పరిస్థితి లేదని, శాస్త్రీపురం ఆర్వోబీ పనులు నిలిచిపోయాయన్నారు. ప్రతిపక్షాల మీద అక్రమ కేసులు పెట్టి చంచల్‌గూడ జైలుకు పంపే శ్రద్ధ .. ఫ్లై ఓవర్లను పూర్తి చేయడంపైన లేదన్నారు. కాంగ్రెస్ అంటే కమీషన్లు దండుకోవడం, కబ్జాలు చేసుకోవడం కక్ష తీర్చుకోవడమేనా? అని కేటీఆర్ ప్రశ్నించారు. అభివృద్ధి అంటే భూములను చెరబట్టడం, బుల్డోజర్లను ఉసిగొల్పడం కాదు అని కేటీఆర్ ధ్వజమెత్తారు.



జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

# అనుమతులున్నా..వసూళ్లు చేస్తున్నారు

టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఎమ్మెల్యే కృష్ణారావు ఫైర్

సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): టౌన్‌ప్లానింగ్ విభాగంలో కొందరు అధికారుల తీరును ఎండగడుతూ ఎమ్మెల్యే కృష్ణారావు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పర్మిషన్ ఉన్నా కూడా ఒక్కో బిల్డింగ్‌కు రూ.35 లక్షలు వసూలు చేస్తున్నారంటూ అడిషనల్ సీసీపీ గంగాధర్‌ను కలిసి వివరించారు. అధికారులు ఒక్కో దగ్గర ఒక్కో విధానంలో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అయ్యప్ప సొసైటీ, గోకుల్‌ప్లాట్స్, హఫీజ్‌పేట్, శేరిలింగంపల్లిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఏకంగా ఐదు నుంచి తొమ్మిది ఫ్లోర్‌ల వరకు బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారని, వాటిపై ఎలాంటి ఆంక్షలు లేవని వివరించారు. సామాన్య ప్రజలు (మిగతా IIవ పేజీలో)

# పేదల జోలికి వస్తే సహించం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బేగంపేట్, ఏప్రిల్ 10: పేదల జోలికి వస్తే సహించేది లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. సనత్‌నగర్‌లోని దాసారం లో సుమారు 300 కుటుంబాలు గత 30 ఏండ్ల నుంచి గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. కొందరు వ్యక్తులు తమ ప్రాంతానికి వచ్చి గుడిసెలు ఖాళీ చేయాలని హెచ్చరించారని ఆందోళనకు గురైన వారు గురువారం వెస్ట్ మారేడ్ పల్లిలోని మంత్రి కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎన్నో సంవత్సరాల నుంచి తాము ఇక్కడే ఉంటున్నామని, ఇప్పుడు తమను వెళ్లిపోవాలంటే ఎక్కడికి పోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ రెవెన్యూ, పోలీసు, జీహెచ్ఎంసీ తదితర శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. బాధితుల వెంట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, అధ్యక్షుడు హన్మంతరావు, సురేశ్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, కుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ని కలిసిన దాసారం బస్తీ ప్రజలు



కాంగ్రెస్ నాయకులను బీఆర్ఎస్ లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

# కాంగ్రెస్ ప్రజలను మోసం చేసింది

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

మల్కాజిగిరి ఏప్రిల్ 10: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేయకుండా మోసం చేసిందని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి విమర్శించారు. గురువారం బోయిన్ పల్లిలోని క్యాంపు కార్యాలయంలో మల్కాజిగిరి నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులను బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి చేస్తున్న కృషిని గుర్తించిన వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని, అందరికీ పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. మచ్చ బొల్లారంలోని హిందూ శ్మశాన వాటికను రాంకీ సంస్థ ఆక్రమించి చెత్త డంపింగ్ యార్డుగా మార్చడంతో చేసిన ఉద్యమానికి ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకంలో తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి మొహం చాటేసిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, నరేంద్ర రెడ్డి, శరణ్గిరి, పవన్, ప్రశాంత్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు మద్యం దుకాణాలు బంద్

సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 12న ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు మద్యం, కల్లు దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు మూసివేయాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. స్టార్ హోటల్స్, రిజిస్టార్ క్లబ్స్‌కు ఈ ఉత్తర్వుల నుంచి మినహాయింపులున్నట్లు వెల్లడించారు.

# పలు చోట్ల వర్షం

సిటీ బ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): నగరంలో గురువారం మధ్యాహ్నం మియాపూర్, గచ్చిబౌలి, ఎస్సార్ నగర్, పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో వర్షం కురిసింది. కుమ్యులో నింబస్ మేఘాల ప్రభావంతో వర్షాలు పడుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుందన్నారు.

# తెగుతున్న బంధాలు.. పోతున్న ప్రాణాలు

చిన్నచిన్న కారణాలతో హత్యలు

కుటుంబ సభ్యులనే కడతేరుస్తున్నరు

దిగజారుతున్న మానవ సంబంధాలు

నానాటికీ పెరుగుతున్న నేర ప్రవృత్తి

సిటీ బ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): తండ్రిని నడిరోడ్డుపై కత్తితో కసితీరా పొడిచి చంపిన ఓ కొడుకు.. అన్నను రోడ్డుపై పరుగెత్తించి పరుగెత్తించి నరికి చంపిన ఓ తమ్ముడు.. కుమారుడిని అతి కిరాతకంగా చితకబాది ప్రాణాలు తీసిన తండ్రి.. ప్రియుడిని పెళ్లి చేసుకోవాలనే వ్యామోహంలో ముగ్గురు పిల్లలను చంపేసిన తల్లి.. ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్న ఈ ఘటనలు ఏవో సినిమాల్లోనో.. కథల్లోనో జరిగినవి కాదు. నిజంగానే జరిగిన అమానుష దారుణాలు. సొంత రక్త సంబంధీకులనే కర్కశంగా అంతమొందించిన నిజాలు. గడిచిన మూడు నెలల్లోనే ఇలాంటి ఘటనలు చూస్తుంటే మనుషుల్లో బంధాలు, బంధుత్వాలు సన్నగిల్లిపోతున్నాయని స్పష్టమవుతున్నది. తమను ఇబ్బందులకు గురిచేస్తేనో.. ఏదో ఒక రకంగా తమకు అడ్డుగా ఉన్నారనో.. అయినవారినే కడతేర్చడం తీవ్రంగా కలచివేస్తున్నది. కారణాలేవైనా సొంత మనుషుల ప్రాణాలు తీయడం మానవ సంబంధాలకు ప్రమాదకరంగా మారుతన్నది.

#### ప్రాణాలు తీస్తున్న దురలవాట్లు..

బంధువులు, రక్తసంబంధీకుల హత్యలకు ప్రధానంగా కుటుంబ కలహాలు, దురలవాట్లు, చెడు వ్యసనాలు, వివాహేతర సంబంధాలే కారణాలవుతున్నాయి. మద్యానికి బానిసలై సొంత తల్లిదండ్రులు, కన్న బిడ్డలను చంపడానికి కూడా వెనకాడటంలేదు. మద్యం మత్తులో ఏం చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితుల్లో దారుణాలకు ఒడిగడుతున్నారు. కనిపెంచిన తండ్రులు కూతురు, కుమారులను చంపుతున్నారు. కొడుకులు తల్లిదండ్రులను కడతేరుస్తున్నారు. మత్తుకు బానిసవడం వల్ల నేర ప్రవృత్తి పెరిగిపోయి ఎంతటికైనా వెనకాడటం లేదు. హత్యలకు కారణాలను విశ్లేషించి అటువంటి మనస్తత్వం ఉన్న వారికి తగిన కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇలాంటి ఘటనలను ప్రభుత్వం నేరాలుగానే పరిగణించకుండా ప్రత్యేక కేసులుగా గుర్తించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి అడ్డుకట్ట వేయాలి.

#### పిల్లల పెంపకంలో లోపాలు...

పిల్లలను పెంచేతీరుపైనే వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. తల్లిదండ్రులను చూసి పిల్లలు వారిని అనుసరిస్తారు. తల్లిదండ్రులకు మద్యం, వ్యసనాల అలవాటు ఉంటే పిల్లలు కూడా నేర్చుకునే ప్రమాదం ఉంటుంది. కాబట్టి పిల్లలకు అలాంటి అలవాట్లను దూరంగా ఉంచాలి. మనుషులతో ఎలా మెలగాలో చిన్నప్పటి నుంచే నేర్పాలి. దాన్ని మరిచి పిల్లల తీరును ఎప్పటికప్పుడు గమనించకుండా ఉండటం వల్ల చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారు. తద్వారా తీవ్ర మనస్తత్వం గల వారిగా మారుతూ దొంగతనాలు, హత్యలకు వెనుకాడటం లేదు. ఈ క్రమంలో ఎవరినైనా చంపడానికి సిద్ధమవుతున్నారు. తల్లిదండ్రులను, తోబుట్టవులను హతమారుస్తున్నారు. ఈ పరిస్థితి మారాలంటే తల్లిదండ్రులు పిల్లల కోసం సమయాన్ని కేటాయించాలి.

#### ఇటీవల కొన్ని ఉదంతాలు..

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఆరెగూడేనికి చెందిన సైదులు ఫిబ్రవరి9న తొమ్మిదో తరగతి కుమారుడు స్కూలు నుంచి ఆలస్యంగా వచ్చాడని చితకబాదాడు. దెబ్బలు తట్టుకోలేక బాలుడు మృతి చెందాడు. మద్యం మత్తులో ఉండటం వల్లనే కుమారుడిని విచక్షణ రహితంగా కొట్టినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

* సికింద్రాబాద్‌లోని లాలాపేటకు చెందిన మొగిలి అనే వ్యక్తిని ఫిబ్రవరి 2న కుమారుడు మిట్ట మధ్యాహ్నం నడిరోడ్డుపై కత్తితో దారుణంగా పొడిచి చంపాడు. తండ్రి మద్యానికి బానిసై నిత్యం ఇంట్లో గొడవ చేస్తున్నాడనే చంపినట్లు యువకుడు పోలీసులకు చెప్పాడు.

* మేడ్చల్‌లో ఫిబ్రవరి 16న (మిగతా IIవ పేజీలో)


## సబ్ ఎడిటర్లు కావలెను

నమస్తే తెలంగాణ దినపత్రికలో సబ్ ఎడిటర్లుగా పని చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. హైదరాబాద్‌లో పని చేయాల్సి ఉంటుంది. అనుభవానికి, నైపుణ్యానికి తగినట్టుగా వేతనాన్ని నిర్ణయిస్తాం.

అర్హతలు - డిగ్రీ తప్పనిసరి.

వార్తల ఎడిటింగ్‌లో అనుభవం ఉండాలి.

క్వార్క్ పేజీ డిజైన్ చేయగలగాలి.

దరఖాస్తులు పంపవలసిన మెయిల్ ఐడీ- hr@tppl.news

8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10,
Banjara Hills, Hyderabad, 500 034,
**HR Landline- 040 23291121**

నమస్తే తెలంగాణ